సాక్షి
తిరుపతి
శుక్రవారం । 31 । జనవరి । 2025



నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు

ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాలపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి హెచ్చరించారు. - 8లో



నాకెవ్వరూ ఎదురులేదు!

చంద్రగిరిలో ఓ రైతు చెలరేగిపోతున్నాడు. ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని ఎంచక్కా పశువుల షెడ్డు నిర్మిస్తున్నాడు. - 8లో



గో సంరక్షణతో సమాజం సుభిక్షితం

గో సంరక్షణతోనే సమాజం సుభిక్షితంగా ఉంటుందని గోరక్ష మహా పాదయాత్ర నిర్వాహకులు తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

త్రైమాసిక పన్నులు చెల్లించాలి



కొర్రపాటి మురళీమోహన్, జిల్లా రవాణాశాఖాధికారి

తిరుపతి మంగళం : రవాణాశాఖకు వాహనదారులు చెల్లించాల్సిన త్రైమాసిక పన్నులను జనవరి 31వ తేదీ లోపు చెల్లించాలని జిల్లా రవాణాశాఖాధికారి కొర్రపాటి మురళీమోహన్ కోరారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. వాహనదారులందరూ వాహన్ పోర్టల్‌లో పన్నులు చెల్లించాలని చెప్పారు. సకాలంలో పన్ను చెల్లించకుండా ఫిబ్రవరిలో వాహన తనిఖీల్లో పట్టుబడితే వంద శాతం జరిమానా విధిస్తామని హెచ్చరించారు. మార్చిలో పట్టుబడితే 200 శాతం జరిమానా విధిస్తామన్నారు. జిల్లాలో దాదాపు 14వేల వాహనాలు త్రైమాసిక పన్నులు చెల్లించకుండా ఉన్నాయని పేర్కొన్నారు.

ఎల్‌ఎల్‌బీ ఫలితాలు విడుదల

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో గత ఏడాది ఆగస్టు, సెప్టెంబర్‌లో జరిగిన మూడేళ్ల లా కోర్సుకు సంబంధించి 4వ సెమిస్టర్, ఐదేళ్ల లా కోర్సుకు సబంధించి 4వ, 8వ సెమిస్టర్ ఫలితాలు గురువారం విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎం దామ్లానాయక్ తెలిపారు. ఫలితాల కోసం విద్యార్థులు వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు. అలాగే మహిళా వర్సిటీలో గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన బీటెక్ ద్వితీయ సంవత్సరం ఫస్ట్ సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి. ఫలితాల కోసం వర్సిటీ వెబ్‌సైట్‌ను వీక్షించాలని వర్సిటీ అధికారులు సూచించారు.

రైతుల అభ్యున్నతే లక్ష్యం



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

తిరుపతి సిటీ: పరిశోధనా సంస్థలు, అగ్రి స్టార్టప్‌లు, రైతు ఉత్పత్తి సంస్థలు సమన్వయంతో రైతు అభ్యున్నతే లక్ష్యంగా పనిచేయాలని హైదరాబాద్‌లోని జాతీయ వ్యవసాయ పరిశోధనా నిర్వహణ అకాడమి హెడ్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఆర్.వెంకటకుమార్ సూచించారు. గురువారం తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో ఐసీఏఆర్, ఆర్‌పిఆర్‌ఎస్, నాబార్డ్ సంయుక్త ఆధ్వర్యంలో 'రైతులు, స్టార్టప్‌ల ఇమ్మర్షన్' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. పరిశోధనా సంస్థలు రైతుల అభ్యున్నతికి కృషి చేస్తున్నా ఫలితాలు వారికి చేరడంలో కొన్ని సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తోందని తెలిపారు. ఇలాంటి పరిస్థితిలో అగ్రి స్టార్టప్‌లు శక్తివంతమైన పాత్ర పోషిస్తూ రైతు ఉత్పత్తి సంస్థల పరస్పర సహకారంతో పని చేసి వ్యవసాయరంగ అభివృద్ధికి తోడ్పాటునందించాలన్నారు. అనంతరం వీసీ శారదా జయలక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో ఏడీఆర్ వీ.సుమతి, డాక్టర్ సునీల్, డాక్టర్ కదిరి మోహన్, శాస్త్రవేత్తలు, నాబార్డ్, ఆంగ్రో అధికారులు, స్టార్టప్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పరిశోధించు!



ఊహలకు పదును పెట్టాలి. గైడ్‌ల సలహాలతో ప్రక్రియను మొదలు పెట్టాలి. నూతన పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలి. లక్ష్య సాధన కోసం పోరాడే క్రమంలో పరిశోధన పత్రాల సమర్పణ, డెమోలు, అసైన్‌మెంట్లు ఇలా ప్రతి విషయంలోనూ ఎంతో అప్రమత్తతో వ్యవహరించాలి. తాను శోధించి.. సాధించిన అంశం సమసజామానికి దిశానిర్దేశం చేసేవిధంగా ఉండాలి. నవతరానికి బాటలు వేయాలి. అప్పుడే ఆ పీహెచ్‌డీకి గుర్తింపు, గౌరవం లభిస్తుంది. ఆ వ్యక్తికి ప్రత్యేక స్థానం దక్కుతుంది. ఆ దిశగా మరిన్ని పరిశోధనలు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

పీహెచ్‌డీలకు నిలయాలుగా వర్సిటీలు

- ఏటా 30 నుంచి 60కిపైగా పట్టాలు?
- లక్ష్యం వైపు సాగాలంటున్న నిపుణులు
- సమాజానికి దిశానిర్దేశం చేయడమే లక్ష్యం



ఎస్వీ వెటర్నరీ వర్సిటీ

తిరుపతి సిటీ: పీహెచ్‌డీ..ఇదో క్రేజ్. పేరు ముందు డాక్టర్ పెట్టుకోవాలనే కోరిక ప్రతి విద్యార్థికీ ఉంటుంది. గతంలో సాగించిన పరిశోధనలు భారత దేశ సత్తాను ప్రపంచదేశాలకు చాటిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఎంతో మంది ప్రముఖులు భౌతిక, రసాయన, జీవ, వ్యవసాయ, గణిత శాస్త్రాలలో చేసిన పరిశోధన ఫలాలు నేటి తరం అనుభవిస్తోంది. సైన్స్ అండ్ టెక్నాలజీతో పాటు ప్రాచీన గ్రంథాలు, పలు భాషలలో నూతన అంశాలపై జరిగిన శోధనలతో దేశం ఆర్థిక, సామాజికాభివృద్ధివైపు అడుగులు వేస్తోంది. భారత్ విశ్వగురువుగా వెలుగొందాలంటే సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు జరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇప్పటివరకు ప్రధానం చేసిన పీహెచ్‌డీలు

యూనివర్సిటీ	స్థాపించిన సం.	ప్రదానం చేసిన పీహెచ్‌డీలు	తొలి పీహెచ్‌డీ
ఎస్వీయూ	1954	8,792	1962
పద్మావతి మహిళా వర్సిటీ	1983	854	1992
జాతీయ సంస్కృత వర్సిటీ	1989	1,050	1993
ఎస్వీ వెటర్నరీ వర్సిటీ	2005	185	2009
ఎస్వీ వేదిక్ వర్సిటీ	2006	150	2010

పీహెచ్‌డీ లక్ష్యం ఇదీ

ఫలితం ప్రధానంగా రీసెర్చ్‌లు జరగాలి. సమాజ సమస్యలకు పరిష్కారం చూపాలి. నూతన అంశాలను సమాజానికి పరిచయం చేయాలి. డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ డిగ్రీ పట్టా పొందిన వ్యక్తి తాను సమాజానికి ఏమిచ్చానో తెలియజేసే గొప్ప గౌరవం మంచి పరిశోధనతో వస్తుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

ప్రవేశాలు... అవకాశాలు

యూజీసీ నిబంధనల ప్రకారం ప్రతి ఏడాదీ జనవరి, ఆగస్టు మాసాల్లో రెండు మార్లు పీహెచ్‌డీ ప్రవేశాలకు నోటిఫికేషన్ యూనివర్సిటీలు విడుదల చేయాలి. రాష్ట్రంలోని అనేక వర్సిటీలలో ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో ఆర్‌సెట్ పేరుతో అన్ని వర్సిటీలకు ప్రవేశ పరీక్షను కామన్‌గా నిర్వహిస్తున్నారు. కానీ ప్రతి ఏడాదీ సక్రమంగా నిర్వహించకపోవడంతో చాలామంది నిరీక్షించక తప్పడంలేదు. అలాగే కొన్ని వర్సిటీలు ప్రత్యేకంగా రీసెర్చ్ కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలి. ఏదేని సబ్జెక్టులో పీజీ పూర్తి చేసినవారు పీహెచ్‌డీకి అర్హులు. పీహెచ్‌డీ పూర్తి చేసిన అభ్యర్థులు డాక్టరేట్ పట్టాతో వర్సిటీలో అధ్యాపకులుగాను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పరిశోధనా సంస్థల్లో సైంటిస్ట్‌లుగా, అధికారులుగా రాణించే అవకాశముంటుంది.

పరిశోధన సాగే విధానం ఇలా!

పరిశోధకుడు తాను ఎంపిక చేసుకునే అంశం ఆలోచింపజేసే విధంగానూ, సమాజానికి ఉపయోగపడేలా, గత పరిశోధకుల అనుభవాలను, పర్యవేక్షకుని సలహాలతో ప్రక్రియను కొసాగించాలి. రేసెర్చ్ కోసం ఎంపిక చేసుకునే అంశంపై పూర్తి స్థాయి అవగాహన ఉండాలి. ఎంపిక చేసుకున్న అంశంపై విద్యార్థితో పాటు గైడ్‌కు సైతం పరిశోధనకు సంబంధించి సబ్జెక్ట్‌పై పట్టుండాలి. తగిన మెటీరియల్స్ లభ్యత, పరిశోధన చేయాల్సిన ప్రాంతాలపై అవగాహన ఉన్నప్పుడే మంచి ఫలితాలను రాబట్టగలం.



వీటికి సమాధానమేదీ?

పలు వర్సిటీలలో వేలకు వేలు డాక్టరేట్ పట్టాలు ప్రదానం చేస్తున్నాయి. ఇందులో దేశ, సమాజాభివృద్ధికి ఉపయోగపడే పరిశోధనలు ఎన్ని ఉన్నాయనే ప్రశ్నకు సమాధానం కరువైంది. నిపుణులైన పర్యవేక్షకుల ఆధ్వర్యంలో జరిగే ప్రతి పరిశోధనకు ఫలితం రాబట్టాల్సిన బాధ్యత ఎవరిపై ఉంది.. పరిశోధన ఎంపికలో సరైన మార్గదర్శకాలు పాటిస్తున్నారా..? అనే పశ్నలకు జవాబు దొరకడంలేదు. మరికొన్ని వర్సిటీలలో విద్యార్థి పరిశోధన సామర్థ్యాన్ని తూతూమంత్రంగా పరశీలించి డాక్టరేట్లను అందించేస్తున్నారు.

ఆ ఘనత ఎస్వీయూదే



ఎస్వీయూలో జువాలజీ, తెలుగులో సుమారు 700కు పైగా డాక్టరేట్లు ప్రదానం చేశారు. విద్యార్థులు చేసిన పరిశోధనలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. ఇందులో ప్రధానంగా రాడార్, కౌన్సెలింగ్, క్యాన్సర్ వంటివాటిపై చేసిన పరిశోధనల ఫలాలు సమాజం అనుభవిస్తోంది. గతంలో గ్రాంధిక భాషలోనే జరిగే పరిశోధనలు ప్రస్తుతం వ్యవహారిక భాషలో కొనగాతున్నాయంటే అది ఎస్వీయూ పరిశోధకుల కృషి ఫలితమే. – ప్రొఫెసర్ వీసీ.వెంకటేశ్వర్లు, ఏపీఆర్‌సెట్ కన్వీనర్, తిరుపతి

రైతు సంక్షేమమే లక్ష్యం



వెటర్నరీ వర్సిటీలో పాడి రైతు సంక్షేమం, పాడిపరిశ్రమాభివృద్ధి లక్ష్యంగా పరిశోధనలు జరగుతున్నాయి. ఇప్పటివరకు 185 వరకు డాక్టరేట్లు ప్రదానం చేశాం. మేలు జాతి పశువుల సంరక్షణ, డయోగ్నొస్టిక్స్, క్లినికల్, గైనకాలజీ, పశువుల పునరుత్పత్తి, ఫీల్డ్ ఓరియెంటేషన్, పాడి రైతు సమస్యలపై పరిశోధనలు జరిగాయి. –ప్రొఫెసర్ శ్రీలత, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్, ఎస్వీ వెటర్నరీ వర్సిటీ

శుభపరిణామం



విద్యార్థులు పీహెచ్‌డీలలో ప్రవేశాలు పొందడం శుభపరిణామం. ఉన్నత లక్ష్యంతో చేస్తున్న పరిశోధనలు పేపర్లకే పరిమితం కాకూడదు. పరిశోధన ఫలితాలు సమాజానికి, దేశపురోభివృద్ధి దోహదపడాలి. అప్పుడే పరిశోధనలకు విలువ ఉంటుంది. – ప్రొఫెసర్ దేవప్రసాద్‌రాజు, హెచ్‌ఓడీ, ఫిజిక్స్ విభాగం, ఎస్వీయూ

సమాజం ఎదురుచూస్తోంది



విద్యార్థులు దేశానికి దిశానిర్దేశం చేసే భవిష్యత్ ఆశాజ్యోతులు. సంస్కృత వర్సిటీలో ప్రాచీన గ్రంథాలు, తాళపత్ర గ్రంథాలు, సంస్కృత భాషపైనా విలువైన పరిశోధనలు చేసి గుర్తింపు సాధించారు. -ప్రొఫెసర్ రమేష్, గణితశాస్త్ర విభాగం, జాతీయ సంస్కృత వర్సిటీ

ఉడత బెదిరింపులకు భయపడం

- డిప్యూటీ మేయర్‌గా శేఖర్‌రెడ్డి గెలవడం తథ్యం
- ఆయన్ని బెదిరిస్తే ప్రజలే బుద్ధిచెబుతారు
- కూటమి నాయకుల దౌర్జన్యాలపై భూమన ఆగ్రహం



భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులు చేయడం, తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపడమే పనిగా పెట్టుకున్నారని చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతిలో తమ కార్పొరేటర్లను, పార్టీ నాయకులను బెదిరించాలని చూస్తే ఖబడ్దార్ అంటూ ఆయన హెచ్చరించారు. తిరుపతి పద్మావతిపురంలోని తన నివాసంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఫిబ్రవరి 3వ తేదీ తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నిక జరగనుందని తెలిపారు. అయితే వైఎస్సార్‌సీపీ నుంచి డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా 42వ డివిజన్ కార్పొరేటర్ శేఖర్‌రెడ్డిని తమ కార్పొరేటర్లంతా ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్టు వెల్లడించారు. అప్పటి నుంచి శేఖర్ రెడ్డికి, అతని కుటుంబ సభ్యులకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఫోన్లు చేసి డిప్యూటీ మేయర్‌గా పోటీ చేయకూడదని, తప్పుకోవాలంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. తప్పుకోకుంటే గ్యాస్ గోడౌన్ పేల్చేస్తామని, ఇల్లు ధ్వంసం చేస్తామని బెదిరించడం వారి దౌర్జన్యాలకు, అరాచకాలకు నిదర్శనమన్నారు. కూటమి నాయకుల ఉడత బెరింపులకు బెదిరేవాళ్లెవ్వరూ లేరన్నారు. తమ నాయకుడు జగన్ మోహన్‌రెడ్డి గుండె ధైర్యంలో నుంచి పుట్టుకొచ్చిన పార్టీ వైఎస్సార్‌సీపీ అని, ఆ పార్టీలోని నాయకులకు, కార్యకర్తలకు రొమ్మువిరుచుకుని పోరాడడమే తప్ప వెన్నుచూపడం చేతగాదన్నారు. ఫిబ్రవరి 3న జరిగే డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో శేఖర్‌రెడ్డి గెలవడం తథ్యమన్నారు. చేతనైతే పోటీపడి గెలుచుకోవాలే తప్ప బెదిరింపులకు పాల్పడడం సమంజసం కాదని హితవు పలికారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలతో ప్రజలు విసిగిపోయి ఉన్నారని, త్వరలోనే తగిన బుద్ధి చెబుతారని తెలిపారు.

ఇదేమి పాలన చినబాబూ?

- శ్రీకాళహస్తీశ్వరాలయంలో యథేచ్ఛగా దందా!
- అవకతవకలపై ఎక్స్ వేదికగా నారా లోకేష్‌కు ఫిర్యాదుల వెల్లువ
- తూతూమంత్రంగా చర్యలు

శ్రీకాళహస్తి: 'సర్..శ్రీకాళహస్తికి చెందిన పెద్ద నాయకుడు శ్రీకాళహస్తి గుడిలో పాగా వేశాడు. పార్టీకి, తన తండ్రికి చెడ్డ పేరు తెచ్చే విధంగా ప్రవర్తిస్తున్నాడు. అయితే అతనిపై మీరు చాలా గౌరవం చూపిస్తున్నారు. ఇది సరైంది కాదు. ఆ లీడరు డబ్బు సంపాదన తప్ప ఏమీ చేయడంలేదు. ఆలయంలో చేస్తున్న కలెక్షన్ ఆపించాలి. రియల్ ఎస్టేట్, పరిశ్రమల యాజమాన్యాలను వేధిస్తున్నాడు. అహంకారంతో ప్రవర్తిస్తున్న ఆ లీడరును మందలించాలి' అంటూ గుంటమడుగు దినకర్ వర్మ అనే వ్యక్తి నారా లోకేష్‌కు ఎక్స్ వేదిక ఫిర్యాదు చేశారు. అలాగే శ్రీకాళహస్తీశ్వరాలయంలో క్యూల్లో ఉన్న భక్తులకు కాకుండా బయటివారికి ప్రసాదం కవర్లలో ఇస్తున్నారని అనిల్ అనే టీడీపీ కార్యకర్త ఫొటోలతో పోస్టు చేశాడు. దీనిపై నారా లోకేష్ బుధవారం స్పందించారు. భక్తుల మనోభావాలు దెబ్బతీస్తే చర్యలు తీసుకుంటామని ఎక్స్ వేదిక హెచ్చరించారు. ఏడు నెలలు గడుస్తున్నా ఆలయంలో వైఎస్సార్‌సీపీ పోకడలు పోలేదంటూ పేర్కొన్నారు. దీనిపై పలువురు భక్తులు విమర్శలు గుప్పించారు. మీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిని నిగ్గుతేల్చాలని హితవు పలికారు.



ఎక్స్ వేదికగా నారా లోకేస్ ట్వీట్

ఇవేం చర్యలో?

నారా లోకేష్ స్పందనపై ఆలయ అధికారులు అలెర్ట్ అయ్యారు. బుధవారం ఓ సెక్యూరిటీ గార్డును తొలగించి చేతులు దులుపుకున్నారు.

లోకేష్‌కు చేసిన ఫిర్యాదులివీ ..

టిక్కెట్లు ఇచ్చేవారే ఏజెంట్లు

శ్రీకాళహస్తీశ్వరాలయంలో టిక్కెట్లు ఇచ్చేవారే పెద్ద ఏజెంటు. సెక్యూరిటీ వారు కూడా ఓపెన్‌గా దర్శనాలకు డబ్బులు తీసుకుంటున్నారు. – డీ.భాస్కర్

అందరికీ దక్షిణ ఇవ్వాలా?

ఆలయంలో ఎంతమంది అర్చకులు ఉంటే అంతమందికీ దక్షిణ ఇవ్వాలని పీడించుకుతింటారు. రుద్రాభిషేకం టిక్కెటు కొని వెళ్లగా రుద్రాభిషేకం చేయకనే అభిషేకం చేస్తున్నారు. ఐదు నిమిషాలు కూర్చోబెట్టి మమ అనిపిస్తున్నారు. – శివకుమార్

ఆలయంలో ఆగని దందా

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మొత్తం దందా జరుగుతోంది. కొంతమంది దళారులు టిక్కెట్లు తీసుకోకుండా డైరెక్టుగా దర్శనం చేయిస్తామని డబ్బులు అడుగుతున్నారు. ఆ పై డబ్బులు వసూలు చేస్తున్నారు. – కుమారస్వామి

బాబు వాత.. పింఛన్ల కోత!



- ఫిబ్రవరిలో 804 పింఛన్ల తొలగింపు
- 8 నెలల్లో 7,992 పింఛన్ల కోత
- లబోదిబో మంటున్న బాధితులు

తిరుపతి అర్బన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్ల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోంది. ప్రతి నెలా పింఛన్ల విషయంలో కత్తెర పడుతోంది. ఈ జనవరిలో 2,63,995 మందికి పింఛన్లు ఇవ్వగా.. వచ్చే ఫిబ్రవరికి 2,63,191 మందికి మాత్రమే పింఛన్లు ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. ఈ లెక్కన 804 మందికి పింఛన్ల కోత పడింది. జూన్ నుంచి ఫిబ్రవరి వరకు చూస్తే 8 నెలల కాలంలోనే 7,992 మంది పింఛన్లు తగ్గించడం గమనార్హం. ఈ విషయంపై డీఆర్‌డీఏ అధికారులను ప్రశ్నించగా.. వారంతా మృతి చెందారని సమాధానం ఇస్తున్నారు. ఆ మృతి చెందిన వారి జాబితా ఇవ్వాలని కోరితే ఆ జాబితా తమ వద్ద లేదని బుకాయిస్తున్నారు.

తగ్గుతున్న పింఛన్లు

నెల	పింఛన్ లబ్ధిదారులు
జూన్	2,71,183
జూలై	2,69,162
ఆగస్ట్	2,67,772
సెప్టెంబర్	2,67,089
అక్టోబర్	2,66,342
నవంబర్	2,65,488
డిసెంబర్	2,64,636
జనవరి	2,63,995
ఫిబ్రవరి	2,63,191

పింఛన్ల టెన్షన్ ఇలా..

పింఛన్ల తనిఖీలతో భాగంగా మీ పింఛన్ ఉందా.. అనే చర్చసాగుతోంది. ప్రతి నెలా జిల్లా వ్యాప్తంగా 2,63,191 కుటుంబాలకు పింఛన్ల టెన్షన్ తప్పడం లేదు. ఏరోజు ఏం జరుగుతుందో అనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. మంచానికే పరిమితమైన వారికి నెలకు రూ.15వేలు ఇస్తున్నారు. అయితే వాటిని ఈనెల 8 నుంచి 30వ తేదీ వరకు వైద్య బృందాలు తనిఖీలు చేపట్టాయి. తనిఖీల రిపోర్ట్‌ను విజయవాడలోని డీఆర్‌డీఏ హెడ్‌ఆఫీస్‌లో సమర్పించారు. ఆ రిపోర్ట్ వచ్చిన తర్వాత పింఛన్ల జాబితాలో ఎంత మంది ఉంటారో.. ఎంత మంది ఉండరో తెలుస్తోంది.

తనిఖీలు ముమ్మరం



వికలాంగుల పింఛన్లు పొందుతున్న వారిని ప్రభుత్వ ఆస్పత్రుల్లో తనిఖీలు చేస్తున్న వైద్యులు(ఫైల్)

15 రోజులుగా జిల్లాలో రూ.6 వేలు పింఛన్లు తీసుకుంటున్న వారితోపాటు, వికలాంగులకు చెందిన 31,560 మంది పింఛన్లు తనిఖీలు చేస్తున్నారు. ఈ తనిఖీలు మరో రెండు నెలలపాటు కొనసాగనున్నాయి. దీంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. వచ్చే నెల నుంచి రూ. 4వేల పింఛన్లు తీసుకుంటున్న 1,33,450 మందిని తనిఖీ చేస్తారని చర్చసాగుతుంది. ఇంకో వైపు 70వేల మంది వితంతువుల పింఛన్ పొందుతున్నారు. వాటిని తనిఖీలు చేయనున్నారు. నవంబర్ 1కి ముందు భర్త మృతి చెంది వితంతువులు అయిన వారి పింఛన్లు పొందడం లేదు. వారికి పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించలేదు.

ఇంటికెళ్లి పింఛన్ ఇవ్వండి



లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లు ఇవ్వాలి. ఫిబ్రవరి 1వ తేదీ ఉదయం 6 గంటల నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభం చేయాలి. తొలిరోజే వంద శాతం పింఛన్లు ఇవ్వడానికి కృషి చేయండి. ముందు రోజు శుక్రవారమే బ్యాంక్‌ల నుంచి పింఛన్ నగదు డ్రా చే సుకోండి. – ఎస్.వెంకటేశ్వర్, కలెక్టర్, తిరుపతి జిల్లా

పింఛన్లు తొలగించలేదు



ఎవరి పింఛన్ తొలగించలేదు. జూన్ నుంచి ఫిబ్రవరి వరకు 7,992 మంది పింఛన్లు తగ్గిపోయాయి అంటే వారంతా మృతి చెందారు. మరోవైపు మంచానికే పరిమితమై రూ.15వేలు పింఛన్లు తీసుకుంటున్న వారిని వైద్య బృందాలు తనిఖీలు చేశాయి. వికలాంగుల పింఛన్లు తనిఖీలు చేస్తున్నారు. అర్హులు అయితే మీ పింఛన్ ఎక్కడికీ పోదు. – శోభనబాబు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్, తిరుపతి జిల్లా

తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు

తిరుపతి ఎడ్యుకేషన్ : రాష్ట్ర విద్యాశాఖలో ఆధార్ ఎన్‌రోల్‌మెంట్‌కు సంబంధించి ఉద్యోగాలు ఉన్నాయని, రూ.50 వేలు చెల్లించి ఉద్యోగంలో చేరాలని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరుగుతోందని డీఈఓ కేవీఎస్.కుమార్ తెలిపారు. 78422 46298, 93929 19266 ఈ రెండు ఫోన్ నెంబర్ల నుంచి ఈ ప్రచారం వస్తోందని, ఈ ఫోన్ నంబర్ల నుంచి ఫోన్ కాల్, మెసేజ్‌లు వస్తే సమీప పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

క్లుప్తంగా

పశువుల పాకకు నిప్పు


కాలి బూడిదైన పశువుల పాక

చంద్రగిరి: ఏళ్ల తరబడి పశువుల పాక ఏర్పాటు చేసుకుని జీవాలను మేపుకుంటూ జీవిస్తున్న పేదలపై ఓ కబ్జాదారురాలు ఆగ్రహించింది. ఆ భూమి తనదంటూ పేదలపై దౌర్జన్యానికి పాల్పడడంతో పాటు పాకలకు నిప్పంటించిన ఘటన మండల పరిధిలోని పాతశానంబట్లలో చోటు చేసుకుంది. బాధితుల వివరాల మేరకు.. పాతశానంబట్లకు చెందిన పుల్లయ్య, కృష్ణయ్య, దొరబాబు, కృష్ణమూర్తి గత 20 ఏళ్లుగా గ్రామ సమీపంలోని స్వర్ణముఖి నది ఒడ్డున పశువుల పాక, గొర్రెల దొడ్డి, గడ్డివాములు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన సుగాలమ్మ అనే మహిళ గురువారం మధ్యాహ్నం ఆ స్థలం తనదేనంటూ పాడి రైతులపై దౌర్జన్యానికి పాల్పడింది. వెంటనే పశువులు, గొర్రెలను తరలించి ఖాళీ చేయాలంటూ హుకుం జారీ చేసింది. ఈ క్రమంలో బాధితులు మాట్లాడుతూ వంకలో స్థలం ఆక్రమించుకోవడానికి మేముంటున్న ప్రాంతమే మీకు కనిపించిందా అంటూ ప్రశ్నించారు. అనంతరం సాయంత్రం ఎవరూ లేని సమయంలో పశువుల పాకకు, గొర్రెల దొడ్డికి నిప్పు పెట్టి కాల్చి వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలు


సంక్షేమ వసతి గృహానికి చెందిన అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లో ఎస్సీ, బీసీ, ఎస్టీ, గురుకుల వసతిగృహాలకు చెందిన అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మీ సొంత బిడ్డలు వలే విద్యార్థులను చూసుకోవాలని చెప్పారు. నాణ్యమైన భోజనం అందిండం, విద్యుత్ లైట్లు, దోమల నివారణ తదితర అంశాలపై శ్రద్ధ చూపాలన్నారు. మరోవైపు వసతిగృహాలు దెబ్బతిని ఉంటే ఫిబ్రవరి 5వ తేదీలోపు తమకు ప్రతిపాదనలు ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి చెన్నయ్య, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి చంద్రశేఖర్, ఏపీ డబ్ల్యూఐటీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బాలసుబ్రమణ్యం రెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి సూర్యనారాయణ, మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల జిల్లా సమన్వయకర్త రేష్మ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయకర్త గీత పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

బీసీ కార్పొరేషన్ రుణాలను ప్రభుత్వం మంజూరు చేసిందని, ఫిబ్రవరి 7వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్, బీసీ కార్పొరేషన్ జిల్లా చైర్మన్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. 1979 స్వయం ఉపాధి యూనిట్లకు రూ.47.05 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. బీసీ, బ్రాహ్మణ, ఈబీసీ, కమ్మ, క్షత్రియ, రెడ్డి, వైశ్య, కాపు కార్పొరేషన్ల ద్వారా రుణాలు పొందడానికి అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. బీసీ కులానికి 1,174 యూనిట్లు, బ్రాహ్మణులకు 9, ఈబీసీకి 89, కమ్మకు 69, క్షత్రియకు 8, రెడ్డికి 54, వైశ్యలకు 12, కాపులకు 564 యూనిట్లు ఆయ కార్పొరేషన్ల ద్వారా అందిస్తామని స్పష్టం చేశారు. 21 నుంచి 60 ఏళ్ల వయస్సు కలిగిన వారు దరఖాస్తులకు అర్హులని చెప్పారు. అయితే కాపు కార్పొరేషన్‌కు మాత్రం 21 నుంచి 50 ఏళ్ల వయస్సు కల్గి ఉండాలన్నారు.

రూ.100 కోట్ల పనులు పెండింగ్

కలెక్టరేట్‌లో గురువారం పల్లెపండుగ కార్యక్రమాలపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో రూ.100కోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయని మండిపడ్డారు. ఫిబ్రవరి చివరికల్లా వంద శాతం పనులు పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారి రామ్మోహన్, పలువురు ఎంపీడీవోలు, ఏపీఓలు పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి చంద్రగిరి సమస్యలు

గురువారం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కలెక్టరేట్‌ను కలిశారు. తమ నియోజకవర్గానికి చెందిన పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.

కుంభమేళాకు ప్రత్యేక టూర్

తిరుపతి కల్చరల్: ప్రయాగరాజ్ మహా కుంభ మేళా యాత్రకు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక టూరు బస్సులు నడుపుతున్నట్లు ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ డివిజనల్ మేనేజర్ సీహెచ్.శ్రీనివాసరావు ఇందులో భాగంగా తిరుపతి నుంచి ఫిబ్రవరి 11న ఉదయం 6 గంటలకు బస్సు బయలు దేరి కడప, కర్నూలు, హైదరాబాద్ ప్రయాణికులను పికప్ చేసుకొని వెళ్లి తిరిగి 18వ తేదీన తిరుపతికి చేరుకుంటుందని పేర్కొన్నారు. అలాగే నెల్లూరు నుంచి విజయవాడ, రాజమహేంద్రవరం, అన్నవరం, విశాఖపట్నం, పూరి, కోణార్క్, భువనేశ్వర్, కటక్, చండీఘర్, గయా, బుద్ధ గయా, కాశీ, మీదుగా ప్రయాగరాజ్‌కు యాత్ర బస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నెల్లూరు నుంచి ఫిబ్రవరి 12వ తేదీ బస్సు యాత్ర ఆరంభమై 19వ తేదీ నెల్లూరుతో యాత్ర పూర్తవుతుందని తెలిపారు. ఈ రెండు యాత్రలకు దర్శనం ఖర్చులు, టిఫిన్, భోజనం ఖర్చులు ప్రయాణికులే భరించాలని తెలిపారు. ఈ యాత్రకు అనువైన వోల్వో, మల్టీ యాక్సిల్, సెమీ స్లీపర్ బస్సులు కల్పిస్తున్నట్లు తెలిపారు. కుంభమేళాకు వెళ్ల దలిచిన ప్రయాణికులు ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ సీఆర్‌వో ఆఫీసు లేదా వారి ఆధీకృత ఏజెంట్ల ద్వారా యాత్రకు రిజర్వేషన్ చేసుకోవచ్చని తెలిపారు. మహా కుంభమేళా యాత్రకు వెళ్ల దలచిన వారు మరిన్ని వివరాలకు 9848850099, 9848973985, 9848884299లను సంప్రదించాలని ఆయన కోరారు.

ఎస్పీడీసీఎల్‌లో పదోన్నతులు

- చీఫ్ ఇంజినీర్‌గా శోభవాలంటీనా
- ఎస్ఈలుగా ఐదుగురు
- ఈఈలుగా ఆరుగురు
- డీఈఈలుగా పది మందికి పదోన్నతులు

తిరుపతి రూరల్: దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఎస్పీడీసీఎల్) పరిధిలో పలువురికి పదోన్నతి కల్పిస్తూ గురువారం సాయంత్రం సంస్థ సీఎండి సంతోషరావు ఉత్తర్వులు జారీ చేశారు. సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా ఉన్న శోభ వాలంటీనా కు చీఫ్ ఇంజనీర్‌గా పదోన్నతి కల్పించారు. అలాగే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నుంచి సూపరింటెండెంట్ ఇంజనీర్లుగా చక్రపాణి, నీలం నరేంద్రనాథ్, రమేష్, శేషాద్రి శేఖర్, మురళీధర్ బాబులకు పదోన్నతులు ఇచ్చారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా ఉన్న వెంకట ప్రసాద్, బాలాజీ, భాను నాయక్, పద్మనాభం పిళ్ళై, వివేకానంద స్వామి, శ్రీరాములకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా పదోన్నతి కల్పించారు. యమున, రఘు, వరప్రసాద్ రెడ్డి, బాలాజీ, వెంకటసుబ్బయ్య, శ్రీదేవి, భార్గవి, నాగరాజు కుమార్, నరేంద్ర రావు, రాధికాలకు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా పదోన్నతి కల్పిస్తూ సీఎండీ సంతోష రావు ఉత్తర్వులు జారీచేశారు.

గో సంరక్షణతో సమాజం సుభిక్షితం

తిరుపతి కల్చరల్: గో సంరక్షణతో భూమిని రక్షించి సమాజ సుభిక్షతంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని గోరక్ష మహా పాదయాత్ర నిర్వాహకుడు బాలకృష్ణ గురుస్వామి పిలుపునిచ్చారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలనే డిమాండ్‌తో గత సెప్టెంబర్ 25న కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు గోవుతో మహా పాదయాత్ర చేస్తూ తిరుపతికి చేరుకున్నట్టు గుర్తుచేశారు. సమావేశంలో గో పరిరక్షణ నిర్వాహకులు, ప్రకృతి వ్యవసాయ దారులు ప్రభాకర్, చంద్రమౌళి, నిరంజన్ వర్మస్వామీజీ, గీతాంజలి, ఝాన్సీ లక్ష్మీభాయ్, శ్రీనివాస్, జగన్నాథం పాల్గొన్నారు.

ప్రాణం తీసిన వివాదం

– తమ్ముడి చేతిలో అన్న మృతి


మృతి చెందిన కోటయ్య

కోట: తమ్ముడు కర్రతో తలపై బలంగా కొట్టడంతో అన్న ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన గురువారం కోట మండలం, జరుగుమల్లిలో చోటుచేసుకుంది. ఎస్ఐ పవన్‌కుమార్, తెలిపిన వివరాల మేరకు.. జరుగుమల్లి గమళ్లపాళెంకు చెందిన కుమారి కోటయ్య(46), మస్తానయ్య అన్నదమ్ములు. కల్లుగీత కార్మికులుగా పనిచేస్తూ పక్కపక్కనే నివాసాలు ఉంటున్నారు. మస్తానయ్య భార్య గుడ్డలు ఉతికే క్రమంలో మురికినీరు కోటయ్య వాకిలిలోకి వస్తుండగా ఇద్దరి భార్యలు గొడవ పడ్డారు. వివాదం కాస్త అన్నదమ్ముల మధ్య గొడవకు దారితీసింది. కోటయ్య తమ్ముడు మస్తానయ్యపై కర్రతో దాడి చేశాడు. దీంతో మస్తానయ్య సమీపంలో ఉన్న మరో కర్రతో కోటయ్య తలపై బలంగా కొట్టడంతో అక్కడే కుప్పకూలాడు. ఈ ఘటన వాళ్ల తండ్రి వెంకయ్య సమక్షంలోనే జరిగింది. కోటయ్యను కోట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనతో జరుగుమల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతునికి భార్య సుజాత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అప్పగించారు.

పూడు పాముల ముఠాకు జైలు

సత్యవేడు: పూడు పాముల అక్రమ రవాణ కేసులో ముగ్గురు నిందిలు ఒక్కొక్కరికీ ఏడాది జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ సత్యవేడు జ్యూడీషియల్ కోర్టు ఇన్‌చార్జ్ న్యాయమూర్తి గోపాలకృష్ణ తీర్పు వెల్లడించినట్లు స్థానిక అటవీ శాఖ రేంజర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. జైలు శిక్ష పడ్డ వారిలో పేరడం యానాది కాలనీకి చెందిన మేకల లక్ష్మయ్య, తమిళనాడు ఊత్తుకోట్టై అంబేడ్కర్ కాలనీకి చెందిన రాధ ఉన్నారు. కాగా కేసుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. 2009 జూలై 22వ తేదీన అటవీ ప్రాంతంలో నాలుగ పూడు పాములు పట్టుకొని అక్రమంగా రవాణా చేస్తున్నారు. అప్పటి ఎస్ఐ బీవీ.శ్రీనివాసులు వారిని పట్టుకుని, పూడు పాములతో సహా అటవీ శాఖకు అప్పగించారు. ఈ నేపథ్యంలో అప్పటి అటవీశాఖ అధికారి జయప్రసాద్‌రావు దీనిపై కేసు నమోదు చేసి అటవీ సెక్షన్ ప్రకారం కోర్టులో కేసు దాఖలు చేశారు. ప్రస్తుతం ఎఫ్‌పీఓగా పనిచేస్తున్న వేణుగోపాల్ ఇందుకు సంబంధించిన సాక్షులను ప్రవేశపెట్టారు. పీపీ లత వాదించారు. నేరం నిరూపతమవడంతో ముద్దాయిలకు జైలు శిక్ష విధించారు.

ఎన్ఈఈఆర్ఐ డైరెక్టర్‌గా ఎస్వీయూ పూర్వ విద్యార్థి


డాక్టర్ ఎస్వీ మోహన్‌ను సన్మానిస్తున్న ఏబీఆర్ఎస్ఎమ్ అధ్యక్షులు, సైంటిస్టులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ పూర్వ విద్యార్థి డాక్టర్ ఎస్వీ మోహన్ నాగపూర్‌లోని కేంద్రప్రభుత్వ సంస్థ నేషనల్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్ఈఈఆర్ఐ) డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఎస్వీయూలో సివిల్ ఇంజినీరింగ్‌లో బీటెక్, ఎంటెక్, పీహెచ్‌డీ పూర్తి చేసిన ఆయన ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీలో చీఫ్ సైంటిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన ఎన్ఈఈఆర్ఐ డైరెక్టర్‌గా నియమితులైన సందర్భంగా ఏబీఆర్ఎస్ఎమ్ రాష్ట్ర అధ్యక్షులు, ఎస్వీయూ ప్రొఫెసర్ డాక్టర్ వైవీ.రామిరెడ్డి గురువారం ఆయనను హైదరాబాద్‌లోని ఐఐసీటీలో కలసి ఘనంగా సన్మానించారు. ఆయన వెంట ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ డీ.శ్రీనివాసరెడ్డి, శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ కిరణ్, డాక్టర్ సౌజన్య ఉన్నారు.

దిగజారుతున్న తిరుమల ప్రతిష్ట

- టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ధ్వజం

తిరుపతి గాంధీ రోడ్: చంద్రబాబు హయాంలో టీటీడీ ప్రతిష్టను దిగజారుస్తున్నారని టీటీడీ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆయన మాటల్లోనే..చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత గత ప్రభుత్వం టీటీడీని పూర్తిగా భ్రష్టు పట్టించిందని, పాప ప్రక్షాళన చేసి స్వామివారి ఆలయాన్ని పునీతం చేసి ఒక గాడికి తెచ్చి భక్తులకు చాలా మెరుగైన సౌకర్యాలు, ఉన్నతమైన దర్శనం కల్పిస్తామని చిలక పలుకులు పలికారు. అయితే వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీ సమయంలో క్యూలను సైతం సరిగా నిర్వహించలేని పరిస్థితి ప్రస్తుత ప్రభుత్వానిది. అవగాహన రాహిత్యంతో ఆరుగురు భక్తులు చనిపోయారు. 40 మందికి పైగా భక్తులకు తీవ్ర గాయాలపాలయ్యారు. కేవలం ఈ ప్రభుత్వం అలసత్వం, బాధ్యతారాహిత్యం వల్లే ఈ దుర్ఘటన జరిగింది. వైఎస్సార్‌సీపీ హయాంలో చైర్మన్‌గా వ్యవహరించిన నేను, వైవీ సుబ్బారెడ్డి లడ్డూ ప్రసాదాలకు వినియోగించే నెయ్యిలో ఆవు, పంది కొవ్వు కలిపామని చంద్రబాబు అత్యంత దారుణమైన ఆరోపణలు చేశారు. దీనిపై సుప్రీం కోర్టు సీబీఐ విచారణ వేయమని చెప్పింది. ఆ ఒక్క మాట ద్వారా చంద్రబాబు వ్యక్తిత్వం పాతాళంలోకి పడిపోయింది. పరమ భక్తుడిని అని చెప్పుకునే చంద్రబాబు స్వామి వారిని రాజకీయాలకు వాడుకుంటున్నారు. కేవలం రాజకీయాలకు పావుగా శ్రీవారి పేరును చంద్రబాబు వాడుకోవడం శోచనీయం. చంద్రబాబు పాలనపై ప్రజలు అసహనం వ్యక్తంచేస్తున్నారు. తిరుమలలో ఆరేళ్ల బాలుడు కిందపడి చనిపోయాడు. లడ్డూ కౌంటర్‌లో అగ్నిప్రమాదం జరిగింది. టీటీడీ ఉద్యోగులే నాలుగు మాడ వీధుల్లో చెప్పులు ధరించి నడుస్తున్నారు. కొండపైకి బిర్యానీ ప్యాకెట్లు తీసుకొచ్చి ఆలయం ముందు భాగంలో ఉన్న రాంబగీచా బస్ స్టాండ్ వద్ద భక్తులు తిన్నారు. తిరుమలలో మద్యం బాటిల్స్ విక్రయిస్తుంటారని సమాచారం. ఇదీ చంద్రబాబూ.. మీరు చేస్తున్న పాలనలో టీటీడీ నిర్వాకం. తిరుమలను ఎర్ర చందనం స్మగ్లింగ్‌కు ఓ రహదారిగా మార్చారు. టీటీడీ చాగంటి కోటేశ్వరరావు సరిగా పట్టించుకోలేదని చెప్పిన యూట్యూబ్ చానళ్లపై కేసులు పెట్టారు. ఆ చానల్ అనుమతిని సైతం రద్దు చేయాలనే తలంపు చేపట్టారు. ఇందులో ఇద్దరు చానెళ్ల అధిపతుల హస్తం ఉంది. వైకుంఠ ఏకాదశి నాడు చాగంటి వచ్చారు. ఆయన ప్రవచనాలను వాడుకోవడంలో టీటీడీ విఫలమైందని సదరు యూట్యూబ్ చానల్ వారు చెప్పారు. కొండపై బిర్యానీ తిన్నా, మద్యం విక్రయిస్తున్నా ఎలాంటి చర్యలు లేవు. ఎర్రచందనం దుంగలు తరలిస్తున్నా చర్యలు కరువు. ఆరుగురు చనిపోయినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. జేఈవోను ట్రాన్స్‌ఫర్ చేసి చేతులు దులుపుకున్నారు. వైఎస్ఆర్ అనే సీనియర్ జర్నలిస్టుపై అబద్ధపు కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసం. ఏ పార్టీకి కొమ్ము కాయకుండా నిష్పక్షపాతంగా మాట్లాడితే వైఎస్ఆర్ పై దాడిచేయడం తీవ్రంగా ఖండిస్తున్నాం' అని ఆయన పేర్కొన్నారు.

మిస్ యూ చైతూ బావా

- శుక్రవారం పెళ్లి.. ముందురోజు యువతి మృతదేహం లభ్యం
- డిసెంబర్ 14న వివాహ నిశ్చితార్థం
- జనవరి 20న యువతి అదృశ్యం
- 'ఐ లవ్ యూ చైతూ బావా..' అంటూ చివరి లేఖ


లేహా నిస్సీ రాసిన చివరి లేఖ


పంబలేరులో మృత దేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ తిరుపతయ్య (ఇన్‌సెట్) లేహా నిస్సీ(ఫైల్)

గూడూరు రూరల్: 'చైతు బావా.. నా కోసం ఏదైనా చేస్తాను అన్నావుగా.. నీకు పుట్టే బిడ్డకు నా పేరు పెట్టు.. నాకు మీరు చూడగానే నచ్చారు. మీ లైఫ్‌లోకి వచ్చినందుకు చాలా హ్యాపీ అని మీరు అన్నారు. ఆ మాటకు నేను చాలా హ్యాపీగా ఫీలయ్యా.. కానీ ఇప్పుడు బాధపడుతున్నా. మిమ్మల్ని వదిలి వెళుతున్నా.. నా జ్ఞాపకాలు మీతో విడిచి వెళ్లిపోతున్నా.. సారీ..' అని రాసి ఓ యువతి అదృశ్యమైంది. ఆమెకు శుక్రవారం పెళ్లి జరగాల్సి ఉండగా.. గురువారం శవమై తేలింది. ఈ ఘటన గూడూరులో కలకలం రేపింది. వివరాలు.. గూడూరు ఒకటవ పట్టణ ఎస్ఐ తిరుపతయ్య కథనం.. సూళ్లూరుపేట రాఘవయ్యపేట ప్రాంతంలో నివాసం ఉండే శ్యాముయేల్ జయకుమార్ గూడూరు సమీపంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. ఆయన భార్య రమాదేవి. వారి కుమార్తె లేహా నిస్సీ(19)ను తాను పనిచేసే కళాశాలలో డేస్ స్కాలర్‌గా బీటెక్ ఈసీఈ గ్రూపులో చేర్పించారు. ప్రస్తుతం ఆమె ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కాగా తన ఆరోగ్యం బాగా లేక పోవడంతోసెలవు పెట్టి ఇంటి వద్దనే ఉంటున్న శ్యాముయేల్ తన కుమార్తెకు వివాహం చేయాలని నిశ్చయించారు.

వివాహం ముందు రోజే..

బంధువుల అబ్బాయితో వివాహం చేసేందుకు డిసెంబర్ 14న నిశ్చితార్థం చేశారు. జనవరి 31న వివాహం జరిపించేందుకు సిద్ధపడ్డారు. అయితే ఈనెల 20న కాబోయే పెళ్లి కుమార్తె నిస్సీ కళాశాలకు అని ఇంట్లో చెప్పి వచ్చేసింది. మళ్లీ ఇంటికి తిరిగి రాలేదు. ఆమె తండ్రి సూళ్లూరుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి పలు ప్రాంతాల్లో వెతుకుతున్నారు. ఎక్కడా ఆచూకీ లభించలేదు. అయితే ఏం జరిగిందో తెలియదు గానీ గూడూరు సమీపంలో తాను చదివే కళాశాలకు పక్కనే ఉన్న పంబలేరులో గురువారం నిస్సీ మృతదేహం లభ్యమైంది. పోలీసులు మృదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు

తిరుపతి మంగళం: ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాలను గడువు లోపు పూర్తి చేయకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బాలకృష్ణ నాయక్ స్పష్టం చేశారు. గురువారం మంగళం పరిధిలోని సప్తగిరి కాలనీలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను, కార్యక్రమాల వివరాలను నిశితంగా పరిశీలించి పురోగతి లేని కార్యక్రమాలను పూర్తి చేయడానికి తగిన సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా ఎన్సీడీ స్క్రీనింగ్, ఆర్‌బీఎస్‌కే స్కూల్ హెల్త్ స్క్రీనింగ్, ఆర్‌సీహెచ్ లక్ష్యాలను తనిఖీ చేశారు. ప్రతి వ్యక్తికీ ఆరోగ్య వైద్య సేవలు అందించడంలో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఆర్‌బీఎస్‌కే నోడల్ ఆఫీసర్ డాక్టర్ పద్మావతి, మంగళం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జయంతి పాల్గొన్నారు.

నాకెవ్వరూ ఎదురులేదు!

- ప్రభుత్వ భూమి ఆక్రమణ
- ఎంచక్కా పశువుల షెడ్డు నిర్మాణం
- అడ్డుకోని యంత్రాంగం

చంద్రగిరి: ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని అక్రమంగా నిర్మిస్తున్న పశువుల షెడ్డుకు అధికారులు నిధులు మంజూరు చేయడం విమర్శలకు తావిస్తోంది. వివరాలు.. రాష్ట్ర ప్రభుత్వం పశువుల షెడ్డు నిర్మాణం చేయదలచిన పాడి రైతులకు సబ్సిడీ నగదును అందిస్తోంది. ఈ క్రమంలో మండల పరిధిలోని భీమవరం గ్రామానికి చెందిన ఓ రైతు తన పొలానికి ఆనుకుని ఉన్న భీమవరం లెక్కదాఖల సర్వే నం.155/1లోని కాలువ పోరంబోకు, సర్వే నం.153లోని ప్రభుత్వ భూమిని అక్రమించుకుని పశువుల షెడ్డు నిర్మాణానికి పూనుకున్నారు. అక్రమంగా నిర్మిస్తున్న షెడ్డుకు స్థానిక ప్రభుత్వ అధికారులే ప్రత్యక్షంగా ప్రోత్సహించడం విమర్శలకు తావిస్తోంది. దీనిపై గ్రామస్తులు సైతం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఆక్రమణ విషయమై వీఆర్‌ఓ భాస్కర్‌ను వివరణ కోరగా... రైతు పక్కన కొంతమేర ప్రభుత్వ భూమి ఉందని, ప్రస్తుతం పనులను నిలిపివేశామన్నారు. సర్వే అనంతరం రైతు భూమిలోనే పశువుల షెడ్డును ఏర్పాటు చేసుకోవాలని సూచించినట్లు తెలిపారు.

అడవి బిడ్డలపై అధికార పార్టీ నేత పెత్తనం

- సాగు భూములు కాజేసే ప్రయత్నం
- పైస్థాయి అధికారులనే బ్లాక్‌మెయిల్ చేస్తున్న చోటా నేత
- సాగుచేసుకుంటున్న భూమిలో ప్రవేశించ కూడదని హెచ్చరిక బోర్డు
- మనస్తాపంతో ఓ గిరిజనుడి ఆత్మహత్యాయత్నం
- తక్షణమే చర్యలు తీసుకోవాలంటూ కుల సంఘాల ఆందోళన


సర్వే నంబర్ 79ఏలో ఉన్న ప్రభుత్వ భూమి



ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

సాక్షి టాస్క్‌ఫోర్స్: రాష్ట్ర ముఖ్యనేత అనుచరుడంటూ ఓ చోటా నేత అధికారులను బ్లాక్ మెయిల్ చేస్తున్నాడు. తనకు సీఎం పేషీలో ఏమి కావాలన్నా చిటికెలో అయిపోతుదంటూ జిమ్మిక్కులు చేస్తున్నాడు. పేదల భూములను కొట్టేసేందుకు ప్రయత్నిస్తుండడంతో నిరుపేదలు ఏం చేయాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. ఏన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటూ భూముల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయించి.. చేతికొచ్చిన నిమ్మ తోటల్లోకి అడుగు పెట్టిన గిరిజనులపై నిర్దాక్షిణ్యంగా కేసులను నమోదు చేయించాడు. ఆ భూములను ఎలాగైనా లాగేసుకునేందుకు ఆ నేత ప్రయత్నాలకు రెవెన్యూ అధికారులు కూడా సహకరించడంతో ఓ గిరిజనుడు మనస్తాపానికి గురయ్యాడు. రెండు రోజుల క్రితం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన శ్రీపొట్టిశ్రీరాముల నెల్లూరు జిల్లాలోని సైదాపురం పంచాయతీ పరిధి, కమ్మవారిపల్లిలో చోటుచేసుకుంది. గిరిజన బాధితులు అందించిన వివరాల మేరకు.. మండల కేంద్రమైన సైదాపురంలోని 793ఏ సర్వే నంబర్‌లో 114 ఎకరాల భూమి ఉంది. గతంలో ఆ భూమి మైనింగ్ లీజులో ఉండేది. గడిచిన కొన్నేళ్లగా మైనింగ్ లీజు గడువు కూడా ముగిసింది. ఆ భూమి సమీపంలోనే కమ్మవారిపల్లి గ్రామం ఉంది. ఆ గ్రామానికి చెందిన ఐదు గిరిజన కుటుంబాలతో పాటు మరో 10 మంది నిరుపేద కుటుంబాలకు చెందిన వారు ఆ భూములు సాగుచేసుకుంటున్నారు. వారు సాగు చేసుకుంటున్న నిమ్మ తోటలపై ఆ భూచోడు కన్ను పడింది. ఆ భూములపై పిటిషన్ పెట్టి అధికారులపై ఒత్తిడి తెప్పించాడు. సాగు చేసుకుంటున్న గిరిజన రైతులపై సైదాపురం పోలీసుస్టేషన్‌లో కేసును నమోదు చేయించారు. ఆ భూముల్లో ఎవరూ ప్రవేశించ కూడదని సోమవారం హెచ్చరిక బోర్డులను పెట్టించారు. ఈ క్రమంలో కమ్మవారిపల్లి గిరిజన కాలనీకి చెందిన యాటగిరి శివయ్య మనోవేదనకు గురై మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టారు.

> **అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలి**
>
> సైదాపురం మండల రెవెన్యూ అధికారులను తక్షణమే విధుల నుంచి తొలగించాలి. గిరిజనుడు శివయ్య ఆత్మహత్యా యత్నానికి కారకులైన తహసీల్దార్, వీఆర్వోలను సస్పెండ్ చేయాలి. యాటగిరి శివయ్య కుటుంబ సభ్యులు గత 16 ఏళ్ల క్రితం నుంచి ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్నారు. ఓ చోటా మైనింగ్ నేతతో స్థానిక అధికారులు కుమ్మక్కై, గిరిజనలను టార్గెట్ చేయడం ఏమిటి? – కల్లూరు పెంచలయ్య, యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు